క్లుప్తంగా

ఓసీపీలను పరిశీలించిన డైరెక్టర్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను గురువారం సింగరేణి ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్‌తో కలిసి ఓసీపీ–2, 3 ప్రాజెక్టులను సందర్శించి బొగ్గు ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు కవీంద్ర, వెంకటరామిరెడ్డి, భిక్షమయ్య, కృష్ణప్రసాద్, కుమారస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



వాజేడు: మండల పరిధిలోని అయ్యవారిపేట గ్రామంలో గురువారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రాల నడుమ కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. కల్యాణానికి తిలకించడానికి వచ్చిన భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కొలువుదీరిన మత్స్యగిరీషుడు



శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయంలోని తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గజవాహనంపై మత్స్యగిరీషుడు కొలువుదీరాడు. భక్తులు పుర వీధుల గుండా మంగళవాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించి మచ్చర్లయ్యగుట్టకు తరలివెళ్లారు. మహిళలు మంగళహారతుతో మత్స్యగిరిషుడికి స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, వరంగల్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవి, కాంగ్రెస్ నాయకులు రవి, కృష్ణమూర్తి, రవీందర్ (బుజ్జన్న), శివశంకర్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం

పరకాల : పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఆరబోసిన ధాన్యం కురిసిన వర్షానికి తడిసిముద్దైంది. బుధవారం మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ ధాన్యాన్ని కుప్పలుగా ఆరబెడితే ఎప్పుడు ఎండుతాయని, పలుచగా ఆరబెట్టాలని రైతులకు సూచించారు. అయితే వర్షం వస్తే పలుచగా ఆరబెట్టిన ధాన్యాన్ని దగ్గరికి చేసేలోపే తలిపోతున్నాయని రైతులు కలెక్టర్ వివరించారు. అయినా కుప్పలుగా ఆరబెట్టొద్దని సూచించారు. దీంతో రైతులు ధాన్యాన్ని పలుచగా ఆరబెట్టారు. కాగా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిముద్దయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం సబ్‌స్టేషన్ పరిధిలో నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ అర్షద్ అహ్మద్ పేర్కొన్నారు. గోదావరి పరివాహకం వెంట ముంపు ప్రాంతంలో ఎత్తైన విద్యుత్ స్తంభాలను వేస్తున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వాజేడు నుంచి ధర్మవరం వరకు ఉన్న గ్రామాలకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాటారం(మహదేవపూర్): పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బెగ్లూర్‌కు చెందిన బుర్ర రాజబాబు(32) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 20న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండటంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యుల సూచన మేరకు వరంగల్‌కు తరలించారు. రాజబాబు చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీలతో జాగ్రత్త!

- వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతన్న
- విత్తనాల కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం



షాపును తనిఖీ చేస్తున్న అధికారి(ఫైల్)

మల్హర్: ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలంటే రైతులు ఆది నుంచే అన్ని విషయాల్లోనూ అప్రమత్తంగా ఉండాలి. దుక్కి దున్నింది మొదలు పంట చేతికొచ్చే వరకు సాగుకు సంబంధించి జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లలో అత్యంత జాగ్రత్తలు అవసరం. లైసెన్స్ ఉన్న ఎరువుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన ఎరువులకు ఒరిజినల్ బిల్లు తీసుకోవాలి. డీలర్ బుక్‌లో విధిగా రైతులు సంతకం చేయాలి. మిషన్ కుట్టు ఉన్న ఎరువు సంచులను మాత్రమే కొనాలి. చేతితో కుట్టినట్లయితే దానిపై సీసంతో సీల్ ఉందో లేదో చూడాలి. బస్తాపై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తిదారుని వివరాలు ఉండాలి. రైతు తప్పనిసరిగా బస్తాను తూకం వేయించి తీసుకోవాలి. చిరిగిన రంధ్రాలు ఉన్న బస్తాలను తీసుకోవద్దు. కొనుగోలు చేసిన ఎరువుల విషయంలో అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. అనుమానం ఉన్న ఎరువుల నమూనాలను రూ.10 డీడీని జతచేసి పరీక్షలకు పంపించాలి.

రశీదు తీసుకోవాలి



మండలంలో ఆయా గ్రామాల్లో లైసెన్సులు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. దుకాణాల్లో కొనుగోలు చేసిన విత్తానాలకు, ఎరవులకు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.

– సుధాకర్, మండల వ్యవసాయ అధికారి, మల్హర్

నిరుపయోగంగా నీటితొట్లు



శిథిలావస్థకు చేరిన నీటి తొట్టి



బురద నీటిని తాగుతున్న గేదెలు

వెంకటాపురం(కె): మండలంలో వేసవి కాలంలో మూగజీవాల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో గతంలో వెంకటాపురం, ఉన్నేడు గొల్లగూడెం గ్రామ పంచాయతీల్లో నీటి తొట్లను ఏర్పాటు చేశారు. పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు పగిలి పోవంటతో పాటు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పశువులు నీటి తొట్ల పక్కన ఉన్న బురద నీటినే తాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటితొట్లపై దృష్టి సారించి పశువుల దాహార్తి తీర్చే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

హనుమాన్ మాలధారులకు భిక్ష



భిక్ష వడ్డిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో గురువారం ఆంజనేయ స్వామి మాలధారులకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు, భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, గురు స్వాములు, పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, నారాయణ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు నగర సంకీర్తన



రామాలయం వద్ద హనుమాన్ భక్తులు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో హనుమాన్ నగర సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురుస్వాములు పేరబోయిన శ్రీధర్, ఇమ్మడి రమేష్, రామకృష్ణ, కొనుపుల కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సీతారామచంద్రస్వామి వారి ఆలయం వద్ద హనుమాన్ మాలధారణ భక్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హనుమాన్ నగర సంకీర్తన కార్యక్రమాన్ని రామాలయం నుంచి శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ములుగు పట్టణ పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించాలని అన్నారు. హనుమాన్ మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాణాల రాజ్‌కుమార్, ఒజ్జల కుమార్, ప్రశాంత్‌రెడ్డి, కొనుపుల సంపత్, జక్కుల రేవంత్, మనోహర్, కల్యాణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరావు

రేగొండ: పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని రూపిరెడ్డిపల్లి, రంగయ్యపల్లి గ్రామాల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలలోని గదులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు తదితర పనులను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెల చివరికల్లా పూర్తి చేయాలని అమ్మ ఆదర్శ కమిటీలను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, జీవిత, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల బెదిరింపులు మానుకోవాలి



మాట్లాడుతున్న వెంకట్

ములుగు: నిరుపేద గిరిజన కుటుంబంపై రెవెన్యూ అధికారులు బెదిరింపులను మానుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ డిమాండ్ చేశారు. ములుగు మండలం ప్రేమ్‌నగర్ సమీపంలో 427/1 సర్వే నంబర్‌లో నివాసం ఉంటున్న వారికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేయడంతో బాధిత కుటుంబాలకు గురువారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ గుగులోత్ సమ్మయ్యతో పాటు ముగ్గురు కుమారులు రవి, రాజన్న, శ్రీను, కుమార్తె సరితలు 2012లో ఇళ్లుకట్టుకొని ఇక్కడే నివాసం ఉంటున్నారని అన్నారు. 1968లో పెంట అయిలయ్యయాదవ్ నుంచి తారీయ ఎకరం 10గుంటల భూమిని కొనుగోలు చేశారని, అక్కడే వ్యవసాయం చేసుకుంటూ బతికారని అన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా తహసీల్దార్, ఆర్ఐలు ఈ భూమి సర్వే నంబర్ 53/1 జాకారం పరిధిలోనిది అని తప్పుడు ఆధారాలు సృష్టించి ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇష్టానుసారంగా ఇంట్లో చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కటుంబం సభ్యులపై అక్రమ కేసులు పెట్టాలని చూస్తే సబంధిత అధికారులపై న్యాయపోరాటం చేస్తామని అన్నారు.

మెజార్టీ వచ్చేలా చూడండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

వాజేడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు వచ్చేలా కార్యకర్తలు పని చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం వాజేడుకు వచ్చిన ఆయన మండల కేంద్రంలోని బుద్దరాజు ప్రసాద రాజు ఇంటి ఆవరణలో కార్య కర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలో మెజారిటీ ఓట్లు వచ్చేలా చుడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

రైతులను ఆదుకోవాలి

కాటారం: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ఆలస్యం కావడంతో రైతులు నిల్వ చేసిన ధాన్యం తడిసి ముద్దయిందన్నారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేయకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

పరామర్శ

రేగొండ: మండలంలోని జూబ్లీనగర్ గ్రామానికి చెందిన కాజీపేట రాజయ్య, సారమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు జంగేటి నరేష్, లెంకల రాజిరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గోపు భిక్షపతి నాయకులు గుర్రాల సుమన్ రెడ్డి, శివారెడ్డి, సంజీవ్, తిరుపతి, రవి, శ్రీనివాస్, రమేష్, భిక్షపతి ఉన్నారు.

గౌతమ బుద్ధుడి జీవితం ఆదర్శం



చిట్యాల: బుద్ధుడి జయంతి వేడుకల్లో నాయకులు



కాటారంలో..

చిట్యాల: గౌతమ బుద్ధుడి జీవితం ఆదర్శనీయమని ఏవైఎస్ మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్ అన్నారు. గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలను మండలం కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఆయన భోదనలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య హాజరై మాట్లాడుతూ.. సమస్త ప్రజానికానికి, జీవకోటికి ప్రేమతత్వాన్ని భోదించి, సంపాదన, జీవితం శాశ్వతం కాదని మంచితనం ఒక్కటే శాశ్వతమని చాటి చెప్పిన బుద్ధుడి జీవితం ప్రతీ జీవికి ఆదర్శమన్నారు. బాల్యంలోనే బాణం దెబ్బకు తీవ్రంగా గాయపడిన పావురాన్ని కాపాడినాడని అన్నారు. అలాగే రెండు రాష్ట్రాల నదీ జలాల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్ నాయకులు కట్కూరి శ్రీనివాస్, మైదం మహేష్, కట్కూరి మొగిళి, గడ్డం సదానందం, గుర్రపు రాజమౌళి, సంధ్య, పుల్ల ప్రతాప్, చందర్ ఉన్నారు.

కాటారం: మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుద్ధిడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకుడు పీక కిరణ్ మాట్లాడుతూ.. బౌద్ధం అహింస, శాంతిని బోధిస్తుందని అందుకే ప్రపంచానికే దేశం శాంత నిలయంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అక్కల బాపు, దయ్యం పోచయ్య, ఉమేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేయాలి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి, సమస్యలపై అవగాహన ఉన్న, ప్రశ్నించే నాయకుడైనా బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విజ్ఞప్తి చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెన్నంపల్లి పాపయ్య అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని దేవి పంక్షన్ హాల్‌లో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు పార్లమెంట్ కన్వీనర్ మురళిధర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగుల, ఉద్యోగుల సమస్యలపై చిత్తశుద్ధితో పోరాడి సమస్యలు పరిష్కరించాలంటే బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి బ్యాలెట్ పేపర్‌లో 1 నంబర్‌లో ఓటేసి గెలిపించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. కాంగ్రెస్ పార్టీతో పసల్ బీమా రాష్ట్రంలో అమలు చేయించామన్నారు. ఈ సమావేశంలో ప్రబారి విజయ రావు, పెద్దపల్లి పార్టీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, రాజమౌళి గౌడ్, యుగేందర్, మధుసూదన్‌రెడ్డి, రాజేందర్, బట్టురవి, రాంచెంద్రారెడ్డి పాల్గొన్నారు.

‘తీన్మార్ మల్లన్నను గెలిపించాలి’



మాట్లాడుతున్న వెంకటనారాయణ

ములుగు: పట్టభద్రుల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను, ఉద్యమకారులను అణిచివేసి నియంత పాలన చేసిన కేసీఆర్ పార్టీ బీఆర్ఎస్‌ను బొందపెట్టాలని అన్నారు. గత 10 సంవత్సరాల్లో మోదీ పాలనతో ప్రజలకు ఒరిగింది ఏమీలేదని అన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్, వేముల సారంగం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

శాయంపేట : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని నవోదయ హైస్కూల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరుగగా ఆయన హాజరై మాట్లాడారు. పట్టభద్రుల తరఫున తన గళం వినిపించే వ్యక్తి మల్లన్న అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్ ఉన్నారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల కిటకిట



ఆలయానికి వెళ్లే దారిలో భక్తులు

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల క్షేత్రం వేలాది మంది భక్త జనంతో గురువారం కిటకిట లాడింది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన లక్ష్మీనర్సింహాస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవానికి అధికారుల అంచనాకు మించి అధికంగా రావడంతో నిత్యం దట్టమైన అడవి భారీ వృక్షాలతో నిత్యం ఆహ్లాదంగా కనిపించే హేమాచల క్షేత్రం జనారణ్యంగా కనిపించింది. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలలోని సుదూర ప్రాంతాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి తరలి వచ్చారు. సుమారు 70 నుంచి 80 వేల మంది వరకు భక్తులు కార్లు, ఆటోలు, డీసీఎంలు, మినీ బస్సులలో తరలి రావడంతో మల్లూరు నుంచి మొదలుకుని గుట్ట పైవరకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి పార్కింగ్ స్థలాల్లో వాహనాలతో నిండి పోయాయి. జాతర ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 04 గంటల వరకు ప్రాంగ్ స్థలం నుంచి గుట్టపై వరకు అన్ని పరిసర ప్రాంతాలు భక్తులతో నిండి పోయింది. ఆలయానికి వెళ్లే మెట్లు, చింతామణికి వెళ్లే దారులు మొత్తం జనంతో నిండి పోయాయి. స్వామివారి కల్యాణ మండపంలో భక్తులు కనీసం నిలుచునేందుకు కూడా స్థలం లేని పరిస్థితి. దీంతో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు గంటల కొద్ది క్యూలైన్లలో ఉండాల్సి రావడంతో ఇబ్బందులకు గురయ్యారు.



విధులు నిర్వహిస్తున్న పోలీసులు



రోడ్డుపై ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనాలు

పోలీసుల సేవలు..

కల్యాణ మహోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందు ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ బాబాసాహెబ్, సీఐ రాజు, ఎస్సై గోదారి రవికుమార్‌తో పాటు సూమారుగా 70 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. అయినప్పటికీ పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడంతో మండు టెండలో ఎంతో ఓపికతో రోడ్డుపై విధులు నిర్వహిస్తూ ఎప్పటి కప్పుడు ట్రాఫిక్ క్లియర్ చేశారు. ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేసేందుకు స్వయంగా ఏఎస్పీ కీలక పాత్ర పోషించి ఎంతో శ్రమించారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి



మృతి చెందిన కాడెద్దు

చిట్యాల: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని గోపాల్‌పూర్‌లో గురువారం చోటు చేసుకుంది. బాధిత పాడి రైతు కటకం రవి కథనం ప్రకారం.. తనకున్న రెండు కాడెద్లు రోజు వారిలాగే మేతకు వెళ్లాయని, గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ గురై ఒక కాడెద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా కాడెద్దు విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.